# ఆలోచన అమృతం

కథల సంపుటి

టి. శ్రీవల్లీ రాధిక



# కథాక్రమం


| | | |
|---|---|---|
| 1. | బహుమతి | 4 |
| 2. | అనురాగం | 12 |
| 3. | గుర్తు | 21 |
| 4. | తిరస్కారం | 30 |
| 5. | ఆమె నవ్వింది | 41 |
| 6. | క్షణికం | 48 |
| 7. | బాల్యం | 57 |
| 8. | చెలగాటం | 64 |
| 9. | నా స్నేహితుడు | 72 |
| 10. | వలయం | 90 |
| 11. | మనసా! ప్రేమించవే! | 101 |
| 12. | ఆలోచన అమృతం | 109 |
| 13. | అమాయకం | 120 |
| 14. | ఆత్మశాంతి | 129 |
| 15. | అలలు విరిగే చోటు | 137 |
| 16. | అతీతుడు | 148 |
| 17. | పరిష్కారం | 158 |
| 18. | లవ్ మారేజ్ | 165 |

# బహుమతి

అప్పట్లో చాలా అందంగా వుండేదాన్ని నేను. కలువరేకులలాంటి కళ్ళు... ఆ కళ్ళ నిండా కోటి కలలు.. కాళిదాసు చూస్తే ఏమని వర్ణించి వుండేవాడో! కాలేజీ కుర్రాళ్ళు మాత్రం "అబ్బ ఏం ఫిగర్ రా!" అనుకునేవారు కళ్ళప్పగించి చూస్తూ.

వాళ్ళు అలా అన్నపుడు పైకి కోపంగా చూసేదాన్ని. కానీ కళ్ళు దించుకున్నాక మాత్రం కొంటె నవ్వుతో పెదవులు కెంపులయ్యేవి.

ఆడుతూ పాడుతూ వుండగానే నా చదువు అయిపోయింది. చదువు అ..యి..పో..వ..డం ఏమిటి! నేనే ఆపేశాను. ఇంకా చదువుకుందాం అన్న ఆలోచనే అప్పుడు నాకు రాలేదు. అసలు అప్పుడు నాకు ఆలోచన అన్న మాటకి అర్థం కూడా తెలీదు. ఎప్పుడూ ఏదో కొంపలు మునిగిపోతున్నట్లూ హడావుడిగా తిరుగుతూ వుండేదాన్ని. పొరపాటున కూర్చుంటే యిక ఎడతెరిపి లేకుండా మాట్లాడుతూ వుండేదాన్ని.

రమణి.. ఇందిర.. జానకి.. అందరం కలిసే వచ్చేవాళ్ళం కాలేజి నుంచి. తీరికగా కబుర్లు చెప్పుకుంటూ ఆ నాలుగు ఫర్లాంగుల దూరాన్నీ నాలుగు గంటలు నడిచేవాళ్ళం.

నేరుగా ఇంటికి వచ్చే అలవాటే వుండేది కాదు. జానకి వాళ్ళింట్లో సన్నజాజులు కోసుకుంటూనో.. రమణీ వాళ్ళింట్లో ఉయ్యాల వూగుతూనో మరో రెండు గంటలు గడిపేవాళ్ళం. లేకపోతే అందరం కలిసి గుడికి వెళ్ళేవాళ్ళం. మా వూర్లో శివాలయం ఎంత బాగుండేదో! చాలా ఎత్తు మీద వుండేది గుడి. అన్ని మెట్లూ సునాయాసంగా ఎక్కేసేవాళ్ళం. తూర్పు వైపున పెద్ద నందివర్ధనం చెట్టు వుండేది. దాని క్రింద కూర్చుంటే వూరంతా కనిపించేది. మాకబుర్లు ఎప్పుడూ అక్కడే.

ఒక్కొక్క రోజు మేము యింటికి వచ్చేసరికి ఎనిమిది దాటేది. అందరి యిళ్ళూ పక్క పక్కనే వుండేవి. ఎక్కడికి వెళ్ళినా నలుగురం కలిసే వెళ్ళేవాళ్ళం. అందుకే ఇంట్లో వాళ్ళు పెద్దగా పట్టించుకునేవాళ్ళు కాదు.

రమణి వీణ బాగా వాయించేది. జానకి పాటలు బాగా పాడేది. ఇందిర సంగతి చెప్పనే అక్కరలేదు. దానికి రాని విద్య లేదు. ఏ పని అయినా చిటికెలో నేర్చుకునేది. మాతో మాట్లాడుతున్నపుడూ.. గుడి దగ్గర కూర్చున్నపుడూ కూడా స్వెట్టర్స్ అల్లడమో.. బుట్టలు అల్లడమో ఏదో ఒకటి చేస్తూనే వుండేది.

ఏ పనీ రానిది నాకే. కానీ చిత్రంగా అందరూ నాకే ఎక్కువ యింపార్టెన్స్ యిచ్చేవారు. అవును మరి! బయటి వాళ్ళకి కనపడేది అందమే కదా!

నేను బి.ఎ. పాస్ అవడమే పెద్ద ఘనకార్యం. నేను పాస్ అయానని తెలియగానే మా అత్తయ్య “దానిది మొదటినుంచీ అదృష్ట జాతకమే.” అంటూ మురిసిపోయింది.

ఆ తర్వాత వారం రోజులకి జరిగాయి నా మొట్టమొదటి పెళ్ళిచూపులు. నాన్న చెప్పారు “ఇంజినీరు. కథలు కూడా వ్రాస్తాడట.” అని. “మన అమ్మాయి బాగా నచ్చింది అతనికి... భావుకుడు కదా!” అన్నారు. చివరి మాట మెల్లగా అన్నరు కానీ అందరికీ వినబడింది. అత్తయ్య మళ్ళీ నా బుగ్గలు నొక్కుతూ “నాకు తెలుసురా. దానిది అదృష్ట జాతకం.” అంది.

పెళ్ళవగానే ఆయనతో హైదరాబాద్ వచ్చేశాను.

అదేం చిత్రమో.. అన్నాళ్ళు తిరిగిన వూరు.. స్నేహితురాళ్ళు .. అందర్నీ వదిలేసి వస్తుంటే కొంచెం కూడా బాధ కలగలేదు. అమ్మని వదిలేసి వస్తున్నందుకు మాత్రం కొంచెం ఏడుపు వచ్చింది.

ఇక్కడికి వచ్చాక కూడా కొన్నాళ్ళు ఏ బాధ్యతలూ లేకుండా తిరగడమే సరిపోయింది. ఆ తర్వాత ఒకరోజు..

సినిమాలో లోగా నేను కళ్ళు తిరిగి పడిపోలేదు. లేడీ డాక్టర్ వచ్చి గంభీరంగా “మీరు తల్లి కాబోతున్నారు” అని చెప్పలేదు. నాకే తెలిసింది ఆ విషయం కొంచెం కంగారు కలిగిస్తూ.

# తిరస్కారం

నెలల పసికందును అపురూపంగా పట్టుకుని జాగ్రత్తగా రైలు దిగింది జయంతి. ముందురోజు రాత్రి రైలు ఎక్కినప్పటినుండి ఏకధాటిగా ఏడుస్తూనే వుందనడానికి నిదర్శనగా ఆమె కళ్ళు ఎర్రగా వాచి వున్నాయి.

బరువయిన సూట్ కేసును కూలీ చేత మోయించుకుంటూ బయటికి వచ్చి రిక్షా మాట్లాడుకుంది. పెళ్ళయ్యాక కాపురానికి వెళ్ళేటపుడు అందరూ యిదే స్టేషన్ కి వచ్చి సాగనంపారామెని.

"మళ్ళీ యిపుడు.. రెండేళ్ళ తర్వాత.. పుట్టింటికి తిరిగి వస్తోంది.. బహుశా శాశ్వతంగా."

జయంతి ఉలిక్కి పడింది ఆ ఆలోచనకి. "శాశ్వతంగా వచ్చేస్తోందా తను!"

ఈ రెండేళ్ళూ తను గడిపిన జీవితం గుర్తు రాగానే, నిలువెల్లా వణికిపోతూ.. వడిలోని పిల్లాడిని గట్టిగా గుండెలకి అదుముకుంది.

కాపురానికి వెళ్ళేటపుడు ఎన్ని కలలతో వెళ్ళింది! ఎన్నోరోజులు పట్టలేదు ఆ కలలు కన్నీళ్ళవడానికి.

అతని మాటలు.. ఆ శాడిజం.. రెండేళ్ళ చిత్రహింస.. "భగవంతుడా! పగవాళ్ళకి కూడా వద్దు." తల వెనక్కి వాల్చి కళ్ళు గట్టిగా మూసుకుంది.

గుండెల్లో దుఃఖం సముద్రంలా పొంగుతోంది. దాన్ని గొంతుకి అవతలే బంధించే ప్రయత్నంలో శరీరం సన్నగా వణుకుతోంది.

"ఏం పాపం చేసిందని తనకీ శిక్ష! ఎందుకింతగా పరీక్షించాడు భగవంతుడు తనని!" అసహాయంగా అనుకుంది జయంతి.

"తనకు తెలిసి తానే పాపమూ చేయలేదు. ఏ తప్పూ చేయలేదు. సుందర్ ని ప్రేమించడం తప్ప తనే పొరపాటూ చేయలేదు."

అవును. ప్రేమించింది. సుందర్ ని ప్రేమించింది.

ఆ ఆలోచనే ఆమెకి చిత్రంగా తోస్తోంది. రెండేళ్ళ క్రితం సుందర్ ని తను ప్రే..మిం..చి.. పెళ్ళి చేసుకుంది!!

ఎలా వుండేది తను ఆ రోజుల్లో!

అప్పటి తన రూపం కళ్ళముందు మెదిలి జయంతి కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి.

జలపాతంలా వుండేది. ఆమె ఎక్కడ వుందంటే అక్కడ సందడి. ఇంట్లో.. ఆఫీస్ లో.. జయంతి పేరు వింటే చాలు ఒక ఉత్సాహ తరంగం ఎగసి పడేది.

అలాంటి తను.. మొట్టమొదటి సారి అతన్ని చూసినపుడే మూగగా మారిపోవడం ఆమెకి గుర్తొచ్చింది.

ఆరోజు.. ఆఫీస్ లో ఏదో వర్క్ చేసుకుంటూండగా బాస్ నుంచి పిలుపొచ్చింది. జయంతి లేచి ఆయన కాబిన్ లోకి వెళ్ళింది.

"కూర్చోమ్మా. హి యీజ్ సుందర్." అంటూ అతన్ని పరిచయం చేశాడాయన.

కాలు మీద కాలు వేసుకుని చాలా హాయిగా కూర్చున్న అతన్ని రెప్పపాటులో గమనిస్తూ విష్ చేసింది జయంతి.

"బెంగుళూర్ నుంచి వచ్చారు. మంచి నాలెడ్జ్, ఎక్స్ పీరియన్స్ వున్న యింజినీర్." బాస్ పరిచయం చేసి వెళ్ళిపోయాక జయంతి అతనితో చాలాసేపు మాట్లాడింది.

ఫ్యాక్టరీ అంతా చూపించింది. కొత్త టెక్నాలజీస్ గురించి చర్చించింది. ఆమె అందాన్నీ, ఉత్సాహాన్నీ, తెలివితేటలనీ అబ్బురంగా చూశాడు సుందర్. పెళ్ళి ప్రస్తావన తెచ్చాడు. ఆమెకేమీ అభ్యంతరం కనబడలేదు. గొప్ప యింజినీర్. అందగాడు. పెద్దవాళ్ళతో మాట్లాడమని చెప్పింది.

మర్నాడే వచ్చాడు. నెల్నాళ్ళలో పెళ్ళయ్యింది. జయంతి ఉద్యోగం వదిలేసి అతనితో బెంగుళూర్ వెళ్ళిపోయింది.

అదిగో.. అప్పట్నుంచే మొదలయిందీ నరకం.

కిరసనాయిల్ పోసి తగలబెట్టడాలూ.. వాతలు తేలేలా కొట్టడాలూ లేవు. చిన్న మాటలు.. చాలా చిన్న చిన్న మాటలు ఉపయోగించి హృదయాన్ని చిద్రం చేయడంలో సుందర్ సిద్ధహస్తుడు.

# బాల్యం

మళ్ళీ తెల్లవారింది. తెల్లవారడం అంటే మళ్ళీ కోడి కూయడం.. మళ్ళీ పన్లోకి వెళ్ళడం.. మళ్ళీ తిట్లు తినడం..

ఏడేళ్ళ కోటి గాడికి తెల్లవారడం అంటే.. చాన్నాళ్ళుగా ఉన్న తన మోకాలి పుండు మీద మళ్ళీ ఒక్కసారిగా ఈగలు ముసరడం.

ఊహ తెలిసినప్పటినుంచీ ప్రతి తెల్లవారుఝామునీ అలా భయంగానే వీక్షిస్తున్నాడు వాడు.

ఊహ తెలిసినప్పటినుంచీ..! అనొచ్చా అలా! ఇపుడిపుడే ఊహ తెలుస్తూన్న కోటిగాడు అనాలా!

ఏమో! పాలు మరిచీ ఎన్నాళ్ళయిందో! కొలువు కుదిరీ ఎన్నాళ్ళయిందో!

వాడి కోరిక మాత్రం కొన్ని యుగాలుగా వాడి మనసులో గూడు కట్టుకుని వుంది...

అంటే దాదాపుగా పన్నెండు నెలల నుంచీ, యాభై వారాల నుంచీ.. మూడు వందలా అరవై అయిదు రోజులనుంచీ!

అవును. సరిగ్గా సంవత్సరం క్రితం తెలిసింది వాడికి..

“రోజూ తను పనిలోకి వెళ్ళిన కాసేపటికి సూరీడొస్తాడంట. ఆడు మెల్ల మెల్లగా గుడిసె పైకి పాకతా వుంటే .. కప్పుకి వున్న సిల్లుల్లోనుంచీ ఆ ఎలుగులు అట్టా నేల మీదికి జారతాయంట. తను చెత్త కుప్ప లో నుంచి ఏరుకొచ్చిన అద్దం ముక్కుందే.. పగిలి పోయిన అద్దం ముక్క.. దాని మీద పడతాయంట ఆ ఎలుగులు. తడికెల మీద గుండ్రాలు గుండ్రాలుగా మెరుస్తాయంట... అప్పుడు గుడిసె గుడిసంతా బంగారం నాగ వుంటదంట ..”

వాడి చెల్లెలు సారమ్మ చెప్పింది వాడికిదంతా. అది చెప్పిన తీరు లోని మహత్యమో! వాడి జీవనరీతి లోని దౌర్భాగ్యమో! కారణమేదైనా వాడి మనసులో మాత్రం ఆ దృశ్యం ఒక ఊహాచిత్రం లా నిల్చి పోయింది. దాన్ని యదార్ధంగా చూడాలన్న ఆశతో వాడి హృదయం కొట్టుకుపోతోంది.

ఒకరోజు కాదు. రెండు రోజులు కాదు. దాదాపు సంవత్సరం నుంచీ!

కానీ ఎలా కుదుర్తుంది! కుదరదు.

చీకటితోనే పన్లోకి రావాలని తులశమ్మ గారు ముందే చెప్పింది.

పాల పాకెట్లు తెచ్చిపెట్టడంతో మొదలవుతుంది వాడి డ్యూటీ. ఆ తర్వాత నీళ్ళు పట్టాలి. ఇల్లు తుడవాలి. ఏమన్నా సరుకులు కావాలంటే బజారుకెళ్ళి తెచ్చిపెట్టాలి. అయ్యగారికి టిఫిన్ డబ్బా యిచ్చి రావాలి. బుల్లయ్యగారిని ఆడించాలి.

“.. ఆడించడమంటే కూసుని ఆడుకోడం కాదు. ఆరు ఏడవకుండా సూసుకోవాలి. అంటే ఎప్పుడూ ఎత్తుకుని తిప్పుతా వుండాలి.”

వీటన్నిటి మధ్యా సూర్యుడు ఎప్పుడొస్తాడో, ఎప్పుడు పోతాడో కోటిగాడికి తెలిసే అవకాశమయినా ఉండదు. ప్రొద్దున పూట నీళ్ళు పట్టడమూ.. రోజంతా పసిపిల్లాడిని ఎత్తుకుని మోయడమూ రెండూ వాడి శక్తికి మించిన పనులే.

కోటిగాడి భాషలో బుల్లయ్యగారయిన ప్రశాంత్ తులశమ్మగారి మనవడు.

కొడుకు, కోడలు, పెళ్ళి కావలసిన కూతురు.. అందరూ ఉద్యోగాలకి వెళ్తే పసివాడిని చూడటం ఆవిడ వల్ల కాలేదు. అందుకే ఒక పనివాడు అవసరమయ్యాడు. ఎపుడయితే పనివాడు దొరికాడో, అపుడు పసిపిల్లాడిని చూడటంతో పాటు యింకా చాలా పనులు వాడి నెత్తి మీద ఆటోమేటిగ్గా పడిపోయాయి.

సాయంత్రం.. స్వప్నమ్మగారు, అదే.. తులశమ్మగారి కోడలు వచ్చేదాకా పసిపిల్లాడి బాధ్యత తప్పదు కోటిగాడికి. ఆవిడ వచ్చాక, అప్పుడు మొక్కలకి నీళ్ళు పెట్టి ఏడవుతూండగా గుడిసె చేరతాడు.

తల్లి పళ్ళెంలో అన్నం పెట్టి యిస్తే, అది తిని, గుడిసె బయట... చల్లటి వెన్నెల్లో.. ఒక చిన్న గుడ్డ పరుచుకుని పడుకుంటాడు.

అప్పుడు.. అలా పడుకుని ఆకాశంలో చంద్రుడినీ, చుక్కలనీ చూస్తున్నపుడు.. మళ్ళీ వాడి కోరిక మెల్లగా మనసుని గుచ్చుతుంది.

“అమ్మా! రేపొక్క రోజూ పన్లోకెళ్ళనే.” అంటాడు మొర పెట్టుకుంటున్నట్లుగా.

# నా స్నేహితుడు

అలసిన ప్రపంచమంతా ఆదమరచి నిద్రించేటపుడు.., చంద్రుడూ, తారలూ మాత్రమే తొంగి చూస్తున్నపుడు.., అలవోకగా ఆకాశం నుండి దిగివచ్చిన అప్సరకాంతలా వుంది సంధ్య.

చక్కటి చిరునవ్వుతో సూర్యుడికి సుప్రభాతం పలుకుతూ, అందంగా ముగ్గుపెట్టే సంధ్యని చూస్తే ఏ అజ్ఞాత చిత్రకారుడి తపఃఫలమో అనిపిస్తుంది.

ఏ రోజయినా, ఏ కాలమయినా సంధ్య ముగ్గు వేసే సమయంలో ఒక్క నిమిషం కూడా తేడా వుండదు.

ఆ దృశ్యాన్ని మిస్ అవకూడదన్న బలమయిన కోరిక వల్ల కాబోలు .. నాకు మెలకువ వచ్చే సమయంలోనూ అరనిమిషం తేడా వుండదు.

కానీ సూర్యుడికీ, ప్రకృతికీ ఆ పంక్చ్యుయాలిటీ వుండదు కదా! అందుకే సంధ్య ముగ్గుకి నేపథ్యం మాత్రం ఒక్కోరోజు ఒక్కో రకంగా వుంటుంది. ఈ రోజు అది అద్భుతంగా వుంది.

తెల్లవార్లూ శ్రమపడి సంధ్యని మలచిన చిత్రకారుడు తెల్లవారుతూందని తెలీగానే ఎక్కడి కుంచెలు అక్కడ పారేసి పారిపోయాడో! ఏమో! ఆకాశంలో ఎరుపు, తెలుపు, నలుపు, నీలం . అన్ని రంగులూ అల్లిబిల్లిగా అంటుకుని వున్నాయి. ఆ రంగుల మధ్యలోనుంచి.. తెల్లటి పరికిణీ, ఓణీలో విచ్చిన నందివర్ధనం పూవులా నడిచి వచ్చింది సంధ్య.

తననే మురిపెంగా చూస్తున్న నా వైపు తిరిగి "గుడ్ మార్నింగ్ అంకుల్" అంది అలవాటుగా.

అలవాటంటే ఒకనాటి అలవాటు కాదు. దాదాపు పన్నెండేళ్ళ అలవాటు.

ఏ సెంటిమెంట్ కీ లొంగని నేను కూడా ప్రొద్దున్నే సంధ్య మొహం చూడకుండా వుండటాన్ని యిబ్బందిగా ఫీలయ్యేంతగా అయిపోయిన అలవాటు.

"కాలేజ్ వుందా యివాళ!" అన్నాను.

"ఊ" అంటూ లోపలికి వెళ్ళబోయింది. మళ్ళీ అంతలోనే ఆగి "ఎందుకు!" అంది అనుమానంగా.

నేను మాట్లాడలేదు.

"కథ చెప్తారా!"

"అనుకున్నాను" నవ్వాను నేను.

"అయితే కాలేజ్ మానేస్తాన్లే. ఇవాళ అంత ముఖ్యమయిన క్లాసులేమీ లేవు. ఇంట్లోనే కొంచెం పనుంది. ఒక గంటాగి రానా!"

తలవూపాను.

అది చూడగానే యిక ఒక్కక్షణం కూడా ఆలస్యం చేయడం యిష్టం లేనట్లు తూనీగలా లోపలికి పరుగెత్తింది.

నేను ఏమైనా వ్రాసే అలవాటు అయిదారేళ్ళ క్రితమే వదిలేశాను. ఇపుడు ఏ రచన అయినా నేను చెప్తుంటే సంధ్య వ్రాసి పెట్టాల్సిందే. అదే నా కుడిచేయి.

ఇపుడిలా నాలో ఒక భాగంగా అనిపిస్తున్న సంధ్య, మేము ఈ యింట్లోకి వచ్చేసరికి నాలుగేళ్ళ పిల్ల.

అప్పుడు నేనొక వర్ధమాన రచయితని. క్రొత్తగా ఉద్యోగంలో చేరిన రోజులు... క్రొత్తగా పెళ్ళయిన రోజులు.

క్రొత్త ఆలోచనలు..ఉత్సాహం.

ఈ యింట్లో అడుగుపెట్టిన గంట లోపలే కనిపించింది సంధ్య... ప్రక్క యింట్లో ఆడుకుంటూ.

మూడు చక్రాల బండి తోసుకుంటూ.. వచ్చీ రాని మాటలతో "ఓ.." అని అరుస్తూ.. ఈ యింటి దాకా వచ్చింది.

వాకిట్లో క్రొత్త మనిషి కనపడగానే టక్కున ఆగిపోయింది. పెద్ద పెద్ద కళ్ళతో ఆరిందాలా చూస్తూ.

# ఆలోచన అమృతం

“ఎంతవరకొచ్చింది వంట!” భర్త ప్రశ్నకి తలతిప్పి చూసింది కమల.

“అయిపోయింది.”

“నేను వెళ్ళి వాళ్ళను తీసుకొస్తాను. బస్ స్టాప్ దగ్గర నుంచి ఫోన్ చేశారు.”

“సరే.” రాఘవ బయటకి వెళ్ళగానే స్టవ్ ఆఫ్ చేసి యివతలికి వచ్చింది కమల.

ఇల్లంతా ఒకసారి పరీక్షించి, ఏ వస్తువూ స్థానభ్రంశం చెందలేదని నిర్ధారించుకున్నాక హాల్లోకి నడిచి ఓ మాగజైన్ చేతిలోకి తీసుకుని కూర్చుంది.

ఆమె విద్యాధికురాలు. ఉద్యోగస్థురాలు కూడా. ఇంటి పనీ.. ఉద్యోగమూ.. రచనావ్యాసంగమూ.. సంగీతమూ.. చాలా విషయాలలో చెప్పుకోదగ్గ ప్రావీణ్యం ఉన్న కమలకి అతిథులనీ, అభ్యాగతులనీ ఆదరించే అవకాశం కొంచెం తక్కువే.

ఒకరి యింటికి వెళ్ళేందుకు కానీ, ఒకర్ని తమ యింటికి పిల్చేందుకు కానీ ఆమె సాధారణంగా సమయాన్ని కేటాయించలేదు.

అయితే ఆవేళ వస్తూన్న అతిథుల ప్రాముఖ్యత వేరు. కళ్యాణ్ రాఘవకి మంచి స్నేహితుడు. ప్రవాసాంధ్రుడు.

తెలుగు పత్రికలలో అతను వ్రాసే వ్యాసాలూ, విశ్లేషణలూ, సమీక్షలూ, విమర్శలూ శ్రద్ధగా చదువుతుందామె. ఎటొచ్చీ అతన్ని చూసే అవకాశమే యింతవరకూ రాలేదు.

“మన సంప్రదాయాల గురించీ ఆచార వ్యవహారాల గురించీ అంత చక్కగా, విశ్లేషణాత్మకంగా వ్రాసే అతను చూడటానికి ఎలా ఉంటాడో!” అనిపించింది కమలకి.

నిజానికి కమలకి కూడా అన్ని పనులూ పద్ధతి ప్రకారం చేయాలన్న కోరిక వున్నా.. తన ఉద్యోగం, యితర వ్యాపకాల వల్ల కొన్ని వదిలేయక తప్పడం లేదు.

అందుకే ఆమెకి కళ్యాణ్ రాక కొంచెం భయాన్ని కలిగిస్తోంది. తమ జీవన విధానం అతని విమర్శకి గురవుతుందేమోనని బెరుకుగా వుంది. ఇంటిని ఎంతో శ్రద్ధగా అలంకరించింది. వంట కూడా చాలా శుచిగా చేసింది. అతిథి మర్యాదకు సర్వసన్నాహాలతో సిద్ధంగా వుంది. అయినా ఏదో బెరుకు.

ఆమె ఆలోచనలలలో  వుండగానే రాఘవ స్నేహితుడితో తిరిగి వచ్చాడు.

"మా కళ్యాణ్.  వైదేహిగారు." అంటూ రాఘవ పరిచయం చేస్తుంటే కమల చిరునవ్వుతో ఆ దంపతులకి నమస్కరించింది.

ముందు అందరికీ ఒక విడత కాఫీ యిచ్చింది. అది తాగుతూ కబుర్లలో పడ్డారు.

ఎక్కువగా కళ్యాణే మాట్లాడసాగాడు. మిగతా ముగ్గురూ అతనికి శ్రోతలయ్యారు. జ్యోతిష్యం.. పురాణాలు.. శాస్త్రాలు.. ఆచారాలు.. ఏ విషయం తీసుకున్నా అనర్గళంగా మాట్లాడుతున్నాడతను.

రెండు గంటల సేపు కబుర్లతో ఎలా గడిచిందో తెలీదు. కమల వంట గదిలోకి నడిచి అప్పడాలు, వడియాలు వేయించసాగింది.

బయటినుంచి వాళ్ళ మాటలు వినిపిస్తూనే వున్నాయి.

పెద్దవాళ్ళ మాటలు చద్దిమూటలనీ.. వాళ్ళు చెప్పిన ప్రతిమాటనీ ఆచరించడం అత్యవసరమనీ.. శాస్త్రాలలో చెప్పినవన్నీ నిర్వర్తించాల్సిన బాధ్యత ప్రతి మనిషికీ వుందనీ అంటున్నాడు కళ్యాణ్.

డైనింగ్ టేబుల్ మీద కంచాలూ, గ్లాసులూ సర్ది "భోజనానికి రండి." అంది కమల.

చేతులు కడుక్కుని వస్తూ "నువ్వు కూడా కూర్చో." అన్నాడు రాఘవ.

"నేను తర్వాత తింటానులెండి." అంది ఆమె వాళ్ళ ముగ్గురికీ వడ్డిస్తూ. ఆతర్వాత తన సహజమైన చిలిపితనంతో ప్రశ్నించింది.

"భర్తకి వడ్డించాకే భార్య తినాలంటారేమో కదండీ మన పెద్దవాళ్ళు!" అని.

"అవును." షర్ట్ చేతులు పైకి తోసుకుంటూ సమాధానమిచ్చాడు కళ్యాణ్.

"ఎందుకనో!" అంది కంచాలలో కూర వడ్డిస్తూ యింకాస్త అల్లరిగా.

# అలలు విరిగే చోటు

"అర్చన వచ్చేది రేపే!!" అనుకుంది భవాని వుద్వేగంతో.

ఆ రోజు నిద్ర లేచాక ఆమె అలా అనుకోవడం అది అరవయ్యో సారి. రెండేళ్ళ తర్వాత ప్రాణ స్నేహితురాలిని చూస్తున్నానన్న నిజం ఆమెని స్థిమితంగా నిలవనివ్వడం లేదు.

ప్రాణస్నేహం. అవును. తమ మధ్య వున్న స్నేహాన్ని వాళ్ళిద్దరూ అలాగే భావిస్తారు. తాము కాలేజ్ లో కలుసుకున్న మొదటి రోజు.. వాళ్ళిద్దరికీ యిప్పటికీ చాలా అపురూపమయిన రోజు.

మూడేళ్ళ కాలేజ్ జీవితం.. హాస్టల్.. కలిసి చూసిన సినిమాలు.. చదివిన పుస్తకాలు.. ప్రతి సంఘటనా వాళ్ళ స్నేహాన్ని పెంచేందుకే తోడ్పడ్డాయి.

ఎపుడయినా.. ఏ పరిస్థితికయినా యిద్దరూ ఒకేలా స్పందించేవారు. సరదాకి పోట్లాడుకుందామన్నా వాళ్ళిద్దరికీ ఏ విషయంలోనూ భిన్నాభిప్రాయం వుండేది కాదు.

"మీ జీవితంలో ఎదురయిన అద్భుతం ఏమిటి?" అని భవానిని ఎవరైనా అడిగితే బహుశా ఒకటే సమాధానం చెపుతుంది. "సరిగ్గా నాలాగే ఆలోచించే స్నేహితురాలు వుండడం" అని.

డిగ్రీ ఎగ్జామ్స్ వ్రాయడం ఆలస్యం అర్చన పెళ్ళయ్యింది. అతను యింజినీర్. పెళ్ళి నాటికి అమెరికాలో వున్నాడు. అతను పనిచేసే కంపెనీ తరుపున ఏదో ట్రైనింగ్ కి వెళ్ళాడు.

తనుకూడా అమెరికా వెళ్తూ భవానిని హెచ్చరించింది అర్చన. "అమ్మావాళ్ళు ఏ సంబంధం తెస్తే దానికల్లా తలూపకు. ఏ క్లర్క్ నో, టీచర్నో చేసుకున్నావంటే లైఫ్ నరకమయిపోతుంది" అని.

భవాని గతుక్కుమంది. ఎందుకంటే అంతకుముందు రోజే ఎవరో ఒక సంబంధం చెప్పారు. అతను సెక్రటేరియట్ లో యు.డి.సి. ఆ సంబంధం కుదిరితే బాగుండునని తల్లీ తండ్రీ ఆశ పడుతున్నారు.

ఏం మాట్లాడాలో తెలీక ఓ క్షణం తడబడి "నాదేముంది!" అంది భవాని నవ్వుతూ.

అలా అమెరికా వెళ్ళిపోయిన అర్చన సంవత్సరం తర్వాత తిరిగొచ్చింది. భర్తకి మద్రాస్ లో వుద్యోగం. అత్తగారు.. మామగారు.. పెద్ద యిల్లు.. ఆ వాతావరణం అంతా వివరంగా ఉత్తరం వ్రాసింది.

దానికి భవాని బదులు వ్రాసింది. తన పెళ్ళి దాదాపుగా ఖాయమయిందనీ.. వరుడి పేరు ప్రకాశ్ అనీ.. పెళ్ళి నెల రోజుల్లో వుండవచ్చనీ.. అర్చన తప్పక రావాలనీ.

ప్రకాశ్ వుద్యోగం సంగతి మాత్రం రాయలేదు. అతను ఒక గవర్నమెంట్ ఆఫీస్ లో టైపిస్ట్. ఆమాట వ్రాసేందుకు ధైర్యం చాలలేదు భవానికి.

అర్చన పెళ్ళికి వచ్చింది. ప్రకాశ్ స్థితిగతుల గురించి ప్రత్యేకించి భవానిని అడగలేదు. అయినా అంతా అర్థమయ్యే వుండవచ్చుననుకుంది భవాని.

ప్రొద్దున పదింటికి పెళ్ళయితే రాత్రి పదిగంటలకి భవాని అత్తవారింటికి ప్రయాణమయింది. ఆవెంటనే అర్చన మద్రాస్ ప్రయాణమయింది.

మళ్ళీ యిప్పుడు.. రెండున్నరేళ్ళ తర్వాత.. అర్చన హైదరాబాద్ వస్తున్నానని ఉత్తరం వ్రాసింది.

ఈ లోపులో భవాని జీవితంలో చాలా మార్పులు వచ్చాయి. ఒక బాబు పుట్టాడు. తను కూడా ఓ చిన్న స్కూల్లో టీచర్ గా జాయినయింది.

రోజూ ప్రొద్దున్నే హడావిడిగా బయల్దేరి, బాబుని రెడీ చేసి బేబీ కేర్ సెంటర్ లో అప్పచెప్పి .. బస్ ఎక్కి స్కూల్ కి వెళ్ళాలి. సాయంత్రం స్కూల్ అయిపోగానే మళ్ళీ బాబుని తీస్కుని యింటికి వచ్చి, వాడి పనులు చూసి, యింటి పనీ, వంట పనీ చేసుకోవాలి.

మధ్యలో ఒక పదిమంది పిల్లలకి ట్యూషన్ చెప్పాలి. దాదాపు ఒక యంత్రం లాగే అయిపోయింది భవాని పని. ఈ విసుగు నిండిన జీవితంలోకి రెండ్రోజుల పాటు మార్పు వస్తుందన్న ఆలోచనే ఆమెకి అంతులేని ఉత్సాహాన్నిస్తోంది.

స్నానానికి వెళ్తూ బీరువాలోనుంచి చీర తీసుకుంటూంటే అర్చన లెటర్ కనిపించింది. అంత హడావిడిలోనూ మరోసారి మడత విప్పి దాన్ని చదవకుండా వుండలేకపోయింది భవాని.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Alochana+Amrutham**

* * *